అంత్యక్రియలు.. ఆరుబయటే!

- వృథాగా మారుతున్న వైకుంఠధామాలు
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు
- ప్రారంభించకముందే శిథిలావస్థకు చేరుతున్న వైనం


మైదాన ప్రాంతాల్లో పూర్తి చేస్తున్న అంత్యక్రియలు


పైకప్పు కూలిపోయి విరిగిన తలుపులు

రామగుండం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల వారీగా నిర్మించిన వైకుంఠధామాలు ప్రారంభోత్సవానికి ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రారంభించకముందే వినియోగిస్తున్నారు. అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారు గోదావరి నది ఒడ్డున రూ.8 లక్షలతో నిర్మించిన వైకుంఠధామంలో బోర్‌వెల్ వేసి వృథాగా ఉంది. నీటి వసతి లేకపోవడం, గదుల పైకప్పు రేకులు, తలుపులు ఎక్కడికక్కడ విరిగిపోయి పరిసరాలన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. దీంతో వైకుంఠధామంలో అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ మొగ్గు చూపించడం లేదు. మైదాన ప్రాంతంలో కార్యాన్ని పూర్తి చేస్తున్నారు. ఒకవేళ వైకుంఠధామంలో దహనం చేసినా తర్వాత పది రోజుల పాటు ఆచారాల నిర్వహణకష్టసాధ్యంగా మారింది.గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు శాస్త్ర ప్రకారం గోదావరి ఒడ్డున అంత్యక్రియలు చేస్తేనే మోక్షం లభిస్తుందనే నమ్మకం ఉండడంతో వైకుంఠధామాల్లో అంత్యక్రియలు చేయకపోవడానికి కారణంగా చెప్పవచ్చు. ఇందులో గోలివాడ, విలేజీ అంతర్గాం, లింగాపూర్, మద్దిర్యాల, పొట్యాల, ముర్మూర్ లోని వైకుంఠధామాల్లో అంత్యక్రియలకు మొగ్గు చూపించకుండా గోదావరి ఒడ్డున పూర్తి చేస్తుండడంతో వైకుంఠధామాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

కనీస సౌకర్యాలు లేకుంటే ఎలా...?



వైకుంఠధామాలు నిర్వహించిన ప్రభుత్వాలు అందులో మౌలిక సదుపాయాల కల్పనపై నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు వినియోగించుకునేందుకు మొగ్గు చూపించడం లేదు. మెరుగైన సౌకర్యాలు కల్పించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దితే ప్రజలు అటువైపుగా మొగ్గు చూపించే అవకాశం ఉంటుంది.

– ఈదునూరి నర్సింగ్, రాయదండి గ్రామస్తుడు

రాత్రి వేళ చాలా ఇబ్బంది



రాత్రి వేళల్లో వైకుంఠధామాల్లో చిమ్మ చీకట్లు కమ్ముకుని ఉండడం, నిర్వహణ బాధ్యతలు చేపట్టకపోవడం, వైకుంఠ ధామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో భవనాలు మధ్యలో పిచ్చి మొక్కల మొలిచాయి. కనీసం ప్రభుత్వం రహదారి సౌకర్యం కల్పించి, వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తే ప్రజలు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

– కొంక కొమురయ్య, అబాది రామగుండం

గోదావరి ఒడ్డున నిర్వహిస్తే పుణ్యం



గోదావరినదికి సమీప దూరంలో ఉన్న గ్రామాలు, పట్టణ ప్రజలు తమ బంధువుల అంత్యక్రియలు నిర్వహించేందుకు శాస్త్ర ప్రకారం గోదావరినది ఒడ్డున కార్యం పూర్తి చేయాలనే నిర్ణయించుకుంటారు. లక్షలాది నిధులతో వైకుంఠ ధామాలు నిర్మించినా గోదావరి ఒడ్డున అంత్యక్రియలు చేస్తే పుణ్యం వస్తుందని చాలా మంది నమ్మకం.

– ఇల్లందుల శ్రీనివాస్, రామగుండం పట్టణ వాసి

రాష్ట్ర బడ్జెట్ ప్రజలను మోసం చేసేలా ఉంది

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌రెడ్డి

గోదావరిఖని: రాష్ట్ర బడ్జెట్ ప్రజలను మోసం చేసేలా ఉందని బీజేపీ. రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శారదానగర్ సరస్వతి శిశుమందిర్ ఆవరణలో జరిగిన బడ్జెట్‌పై అవగాహన సదస్సులో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీగా ఎక్కడ నిలబెడుతుందో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి మేధావులు, న్యాయవాదులు, నాయకులు, కార్యకర్తలకు బడ్జెట్‌పై విశ్లేషణ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అసలు పొంతన లేకుండా ఉందన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రజలను మోసం చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి రామచంద్రం, సత్యం, సోమారపు లావణ్య, సోమారపు అరుణ్‌కుమార్, కార్పొరేటర్ దుబ్బాసి లలిత, కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, కుసుమకుమారి, సూర్యదేవర జ్యోతి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి సాయం


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

జూలపల్లి: మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన నిరుపేద మంద నారాయణ కూతురు అరుణ వివాహానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ రూ.5,116 నూతన వస్త్రాలు అందించారు. కోనరావుపేటలో మల్లారపు రాజయ్య,రాధ కూతురు వివాహానికి రూ.5,116 ఆర్థికసాయం అందించారు. అనంతరం గ్రామంలో కేసీఆర్ సేవాదళం సభ్యులు ప్రజలకు బట్ట సంచులు అందజేశారు. కార్యక్రమాల్లో సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్,యూత్ అధ్యక్షుడు జెట్టి సతీష్,సభ్యులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయానికి ఆదివారం గౌడకులస్తులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల స్వరూప, ఎంపీటీసీ రమేశ్, గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర బానయ్య, కుల పెద్దలు మెండయ్య, రమేశ్, మూల హరీశ్, కులస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చీఫ్ విప్‌కు అభినందన


పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్‌గా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావును పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కలిసి అభినందించారు. ఆదివారం హైదరాబాద్ లోని శాసనమండలిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు సన్మానం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను ఆదివారం నియోజకవర్గం ఇన్‌చార్జి జిట్టవేన ప్రశాంత్ ఆదివారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలుసుకుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు బహుమతి అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: క్రీడలతో మానసిక శారీరకంగా ఉల్లాసంగా ఉంటారని తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ చైర్మన్ తాళ్లపల్లి మనోజ్ గౌడ్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రి నగర్‌లో రూరల్ మండల స్థాయి కేసీఆర్ కప్ క్రికెట్ పోటీల్లో మంచిరామి, నారాయణరావుపల్లి గ్రామాల జట్లు తలపడ్డాయి. నారాయణరావుపల్లి విజేతగ నిలవగా, మంచిరామి ఓటమిపాలైంది. కార్యక్రమంలో సర్పంచ్ మోలుగురి వెంకటలక్ష్మి సీనియర్ నాయకులు అంజయ్య గౌడ్, కాండూరి వాసు, అరుణ్ గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పంట పొలాల్లోనే క్రీడా ప్రాంగణం



పంట పొలాల్లో క్రీడా ప్రాంగణం బోర్డు

రామగుండం: పంట పొలాల్లో క్రీడా ప్రాంగణమా.. అవును నిజమే మీరు వింటున్నది.. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏకంగా పంట పొలాల మధ్యలో ఏర్పాటు చేశారు. మరీ పంట పొలాల్లో క్రీడా పోటీలు ఏంటి... అసలు ఇందులో నిర్వహించే క్రీడలు ఏమిటనే అనుమానాలు ఆసక్తి అందరిలో కలుగుతుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అట్టహాసంగా ప్రతీ గ్రామానికి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా గ్రామాల్లో క్రీడలు నిర్వహించుకునే ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారుల ఒత్తిడితో సాగు చేయని సమయంలో ఉన్నతాధికారులను మెప్పించడం కోసం ఓ స్థలంలో కేవలం తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు మాత్రమే ఏర్పాటు చేసి మమా అనిపించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య క్రీడా ప్రాంగణాన్ని సందర్శించి ముక్కున వేలేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టేందుకు చేసే నిర్లక్ష్యపు పనులతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న విషయాన్ని గ్రహించాలన్నారు. బ్రహ్మణపల్లి క్రీడా ప్రాంగణం విషయమై అధికారులు, రామగుండం ఎమ్మెల్యే స్పందించి తక్షణమే యువత వినియోగించే స్థలాన్ని గుర్తించి క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నామన్నారు.

బంజేరు దొడ్డి కాదు.. సర్కార్ బడి..


చెట్లు మొలిసిన ప్రభుత్వ పాఠశాల

రామగిరి: ఈ ఫొటోలో కనిపిస్తున్నది బంజేరు దొడ్డి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది ప్రభుత్వ పాఠశాల భవనం.. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఈ దుస్థితి పట్టింది. రామగిరి మండలం లద్నాపూర్ పంచాయతీ పరిధి రాజాపూర్ రోడ్డు వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేరనే సాకుతో దాదాపు మూడేళ్ల క్రితం మూసివేశారు. పాఠశాల గురించి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పాఠశాల ఆవరణ అంతా తుమ్మ చెట్లు మొలిచి ఇలా మారింది. విద్యార్థులను పాఠశాలలో చేర్పించాల్సిన విద్యాశాఖ అధికారులు కనీస ప్రయత్నం చేయడకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాల భవనాన్ని ముస్తాబు చేసి విద్యార్థులను చేర్పించి పూర్వవైభవం తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు


టపాసులు పేలుస్తున్న నాయకులు

సుల్తానాబాద్: పట్టణంలో టీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. శాసనమండలి చీఫ్ విప్ గా తానుపర్తి భాను ప్రసాద్ రావు ను ప్రభుత్వం నియమించడంతో సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాల రామారావు మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్ సింగల్ విండో డైరెక్టర్ గాజుల రాయమల్లు, కోడెం అజయ్, బిరుదు కృష్ణ పాల్గొన్నారు.

శాసనమండలి చీఫ్ విప్‌గా భానుప్రసాద్ రావు ఎంపిక పట్ల హర్షం

కాల్వశ్రీరాంపూర్: శాసనమండలి చీఫ్ విప్ గా ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, విప్ గా కౌశిక్‌రెడ్డి ఎంపిక కావడంతో కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడ్డు రాజకొమురయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజా సేవలో పాల్గొని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. సర్పంచు ఆడెపు శ్రీదేవి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఉప సర్పంచు కరుణాకర్ రావు, మాజీ ఎంపీటీసీ తూండ్ల ప్రమీల, నాయకులు రావికంటి వేణు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కరాటేలో విద్యార్థికి గోల్డ్ మెడల్


పతకాలు సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ కరాటే పోటీల్లో బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి గోట్టం ఉద్భవ్ పటేల్ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా ఉద్భవ్ పటేల్ ను బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ దాసరి ప్రశాంత్ రెడ్డి, కరాటే మాస్టర్ మాస్టర్ రాకేష్ రెడ్డి , ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటి నుంచి సాయి ఆలయంలో సప్తవింశతి

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలో కొండపై నెలకొన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఈనెల 14–16వ తేదీ వరకు 27వ (సప్తవింశతి) ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీష్‌కుమార్ తెలిపారు. తొలిరోజు మంగళవారం అఖండ దీపారాధన, అంకురార్పణ, నవగ్రహ తదితర విశిష్ట పూజలు, రెండవ రోజు 15వ తేదీ సకల దేవతా హోమాదులు, మహామంత్రపుష్పం తదితర విశిష్ట పూజలు, చివరి రోజు 16వ తేదీ సప్తవింశతి 108 మంది పుణ్య దంపతులతో చండీయాగం ఇతరత్రా పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పూజల క్రతువుకు వైదిక రత్న బ్రహ్మశ్రీ గట్టు నరహరి శర్మవధాని హాజరు కానున్నారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కానంపెల్లిలో బీజేపీ స్ట్రీట్‌కార్నర్ సమావేశం


మాట్లాడుతున్న సూర్యనారాయణ

ధర్మారం: రాష్ట్ర బీజేపీ కమిటీ పిలుపు మేరకు ధర్మారం మండల కానంపెల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాళ్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాడే సూర్యనారాయణ మాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై వివరించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసి రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కానంపల్లి శక్తి కేంద్ర ఇన్‌చార్జి కొమ్ము మల్లేశం, బూత్ అధ్యక్షుడు గుర్రం సతీశ్, నాయకులు మాజీ సర్పంచ్ గుర్రం తిరుపతి, పొలవేని స్వామి పాల్గొన్నారు.

నిరుపేద బాధిత కుటుంబానికి చేయూత

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో నిరుపేద కటుంబానికి చెందిన గడ్డమీది రవి అనారోగ్యంతో మృతి చెందగా జీఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి రూ. 5 వేలు ఆర్థికసాయాన్ని సర్పంచ్ భారతి జ్యోతిబసు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు తీగెల అశోక్ గౌడ్, వార్డు సభ్యులు బుర్ర మహేశ్, వెంకటేశ్, కొక్కుల బద్రయ్య,బత్తిని జంపయ్య, గడ్డమీది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందుర్తి, గుంపుల, గూడెం గ్రామాల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాలమీదుగా జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్‌ల వైపునకు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఆటపాటలతో ఉల్లాసంగా విద్యార్థులు


ఆటపాటలతో చిన్నారుల సందడి

ఓదెల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన మనఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గుండ్లపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సౌకర్యాలు కల్పించారు. గతంలో మూతపడిన పాఠశాలను సర్పంచ్ పులుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులను చేర్పించి పాఠశాల పునఃప్రారంభించారు. విద్యార్థులకు ఆటపాటలతో ఆటవస్తువులతో సులభంగా విద్యను అభ్యసించటానికి సౌకర్యాలు మెరుగయ్యాయని హెచ్‌ఎం తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

రామగిరి: మండలంలోని నాగేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్ ముప్పిడి తన నానమ్మ, తాత ముప్పిడి రాజమ్మ, కిష్టయ్య స్మారకార్థం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మండలంలోని రాజాపూర్‌కు చెందిన డాక్టర్ పుల్లెల రాజేందర్‌ప్రసాద్ కరీంనగర్‌లో నిర్వహిస్తున్న కియా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 460 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ గ్రీష్మిక ముప్పిడి, ఎముకల వైద్యనిపుణురాలు డాక్టర్ కీర్తన పుల్లెల, ఎమర్జెన్సీ ఫిజిషియన్లు డాక్టర్ అనిల్ కుమార్ ముప్పిడి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పుల్లెల, ఛాతి వైద్యులు డాక్టర్ రవీంద్రా చారి, చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ శ్రీధర్, దంత వైద్యులు డాక్టర్ నిషాంత్ పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరవేని శారద, సర్పంచ్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్లలో ఆదివారం గోదావరిఖని మమత ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్, రక్త తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి లక్ష్మి, డాక్టర్ రాజశేఖర్, శ్రీనివాస్, పటేల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడిగా లచ్చయ్య

ఎలిగేడు: తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎలిగేడు మండల అధ్యక్షుడిగా ముప్పిరితోట గ్రామానికి చెందిన ముత్యం లచ్చయ్యను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్ల సత్తయ్య ముదిరాజ్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యం లచ్చయ్య మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను ఐక్యం చేస్తూ ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతికి, పురోగతికి, సంక్షేమానికి సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో పురోగాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు బల్ల సత్తయ్య ముదిరాజ్, సంఘం జిల్లా, మండల నాయకులకు లచ్చయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకం

రామగిరి: ముత్తారం మండలం హరిపురం గ్రామ కాంగ్రెస్ కమిటీని ఆదివారం నియమించారు. అధ్యక్షుడిగా చేనవేన శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అనుముల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా కూస సంపత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనుముల సంపత్, ఉపాధ్యక్షునిగా శెట్టి అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలజీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బియ్యని శివకుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడవేన సంపత్, తదితరులు పాల్గొన్నారు .

చికిత్స పొందుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు మృతి

గోదావరిఖని: హైటెన్షన్ విద్యుత్‌వైర్లు తాకి తీవ్రంగా గాయపడిన ఆయిళ్ల సందీప్(32) అనే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈనెల 7న స్థానిక న్యూ అశోక టాకీస్ సమీపంలో విధులు నిర్వహిస్తుండగా కిందపడగా, హైటెన్షన్ విద్యుత్ వైర్లు తాకి తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సందీప్ పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య,ఇద్దరు పిల్లలున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు


గౌతమినగర్ చౌరస్తాలో వృథాగా పోతున్న తాగునీరు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తాలో కొన్ని రోజులుగా రామగుండం కార్పొరేషన్ మంచినీటి సరఫరా పైప్‌లైన్ ధ్వంసమై తాగునీరు వృథాగా పోతుంది. కాలనీవాసులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కార్పొరేషన్ అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా పైప్‌లైన్ మరమ్మతు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా:
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాజేశ్ - 9676603963
పెద్దపల్లి : సరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899